క్లుప్తంగా

నీటి సమస్య పరిష్కారానికి బోరుడ్రిల్లింగ్



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రం లోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో నీటి సమస్య పరిష్కారానికి శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ బోరుడ్రిల్లింగ్ చేయించారు. వన మహోత్సవంలో భాగంగా కళాశాల ఆవరణలో సుమారు 3వేల మొక్కలు నాటాలని నిర్ణయించారు. మొక్కల సంరక్షణకు గాను నీటి సౌకర్యం కల్పించాలని ఇటీవల మున్సిపల్ చైర్మన్‌కు ప్రిన్సిపాల్ పద్మావతి విన్నవించారు. ఈమేరకు పవర్ బోరును ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సత్యనారాయణ, నిరంజన్, రాఘవేందర్, ఏఈ వైష్ణవి పాల్గొన్నారు.

➩ స్థానిక మూడో వార్డులోని భరత్‌నగర్‌లో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్ పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో అన్నీ మట్టిరోడ్లే ఉన్నాయని.. మురుగు నీటితో సతమతమవుతున్నామని స్థానికులు వాపోయారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రోడ్లు బురదమయంగా మారుతున్నాయన్నారు. సీసీ రోడ్లతో పాటు డ్రెయినేజీలను నిర్మించాలని కోరారు. చైర్మన్ వెంట వైస్‌చైర్మన్ షబ్బీర్ అహ్మద్, కౌన్సిలర్ రామాంజనేయులు, ఎదిర మాజీ కౌన్సిలర్ శివశంకర్, కాలనీవాసులు వెంకట్‌రెడ్డి, రంగస్వామి, లక్ష్మణ్ ఉన్నారు.

17న చెన్నకేశవస్వామికి లక్ష పుష్పార్చన

జడ్చర్ల టౌన్: ఆషాడ శుద్ధ తొలి ఏకాదశిని పురస్కరించుకొని ఈనెల 17న గంగాపురం లక్ష్మీ చెన్నకేశవస్వామికి లక్ష పుష్పార్చన నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి దీప్తిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, రుత్వికరణం, 10:30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వేదపండితులచే లక్ష పుష్పార్చన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 4గంటలకు లక్ష్మీదేవికి సామూహిక కుంకుమార్చన, రాత్రి 8 గంటలకు ప్రదోషపూజ, 9 గంటలకు స్వామివారి శయనోత్సవం నిర్వహిస్తామన్నారు. గురువారం ఉదయం 7 గంటలకు స్వామివారికి సహస్రనామార్చన, 8 గంటలకు మహా నివేదనతో ఉత్సవాలు ముగియనున్నాయి.

26న ఉర్సే షరీఫ్ వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని రామయ్యబౌలిలో ఈనెల 26న హజ్రత్ షేక్ రఫియొద్దీన్‌షా ఖాద్రీ దర్గా, హజ్రత్ షేక్ అబ్దుల్ రహెమాన్ హుస్సేన్‌షా ఖాద్రీ షరీఫ్ ఉర్సు నిర్వహించనున్నట్లు ముతవలి షేక్ సైఫొద్దీన్ ఖాద్రీ వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని జామియా మసీద్‌లో శుక్రవారం జుమా నమాజ్ అనంతరం జామియా నిజామియా యూనివర్సిటీ ప్రొఫెసర్ మౌలానా సయ్యద్ సఫీర్ అహ్మద్ నక్షబంది చేతుల మీదుగా ఉర్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ముతవలి మాట్లాడుతూ.. 26న రాత్రి 7 గంటలకు గంధోత్సవం.. అదే రోజు యాదే హుస్సేన్ 9వ ధార్మిక సభ ఉంటుందని తెలిపారు. మహ్మద్ నజీరుద్దీన్, మహ్మద్ అబ్దుల్ ఖదీర్ ఖాద్రీ, మహ్మద్ మజహర్ షరీఫ్, ఆసిఫ్ షరీఫ్, పర్వేజ్ మహ్మద్, అబ్దుల్ వాసే మహ్మద్, మహ్మద్ జహీర్, సోహైల్ ఉర్ రహెమాన్, మహ్మద్ అజీజ్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి నివాళి

నవాబుపేట: మండల కేంద్రంలో శుక్రవారం దివంగత మాజీ ఎంపీటీసీ రాధాకృష్ణ ద్వితీయ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ పార్టీల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్‌లో రాధాకృష్ణ చురుకైన నాయకుడిగా ఉంటూ, ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని పలువురు నాయకులు కొనియాడారు.

కోల్డ్ స్టోరేజీలో ఏసీ గ్యాస్ లీక్

అలంపూర్: కోల్డ్ స్టోరేజీలో ఏసీ గ్యాస్ లీకేజీ స్థానికంగా కలకలం సృష్టించింది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉన్న వాతావరణంలో ఒక్కసారిగా దుర్వాసన రావడంతో స్థానికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. తర్వాత గ్యాస్ లీకేజీ జరిగిందనే సమాచారం వ్యాపించడంతో ప్రజలు భయపడ్డారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని ఆపరేటర్‌తో కలిసి గ్యాస్ లీకేజీని నియంత్రించే పనులు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. అలంపూర్ చౌరస్తాలోని ఆర్‌ఆర్ కోల్డ్ స్టోరేజీలో భాగంగా ఉన్న పైప్ నుంచి ఏసీ గ్యాస్ లీకైంది. పైప్ నుంచి భారీగా గ్యాస్ లీకేజీ ఏర్పడి చుట్టుపక్కలకు వ్యాపించింది. గ్యాస్ దుర్వాసనగా ఉండడంతో గ్యాస్ పీల్చుకున్న కొందరికి శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది. గ్యాస్ వాసన ఎక్కడి నుంచి వస్తుందోనని స్థానికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. చివరకు కోల్డ్ స్టోరేజీలో ఏసీకి వినియోగించే అమ్మోనియం గ్యాస్ లీకేజీ అయిందనే విషయం బయటికి రావడంతో సమీప నివాస గృహాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గ్యాస్ లీకేజీ సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు కొనసాగింది. దీంతో గ్యాస్ వాసన పీల్చిన కొందరికి కళ్లలో మంటలు, శ్వాస సంబంధిత సమస్యను ఎదుర్కొన్నారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని కోల్డ్ స్టోరేజ్ నిర్వహణ ఆపరేటర్ వాల్స్ సహాయంతో గ్యాస్ లీకేజీని అదుపులోకి తీసుకురావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పూర్వవైభవం వచ్చేనా?



నిరుపయోగంగా మారిన బాదేపల్లి ఆర్టీసీ బస్టాండ్

- ఒకప్పుడు ప్రయాణికులతో కళకళలాడిన బాదేపల్లి ఆర్టీసీ బస్టాండ్
- నేడు బస్సుల రాకపోకలు లేక వెలవెల
- ఆర్టీసీ మినీ డిపో ఏర్పాటు, బస్టాండ్ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రయత్నాలు

జడ్చర్ల టౌన్: రాష్ట్రంలోనే గొప్ప వ్యాపార కేంద్రంగా బాదేపల్లి పేరొందింది. ఇక్కడ 1936లో రైల్వేస్టేషన్ ఏర్పాటు కాగా, అనుబంధంగా ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటుచేశారు. వివిధ మార్గాల ద్వారా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకునే ప్రయాణికులు.. హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు రైలుమార్గాన్ని వినియోగించే వారు. దీంతో బాదేపల్లి బస్టాండ్ నిత్యం ప్రయాణికులతో కళకళలాడేది. రాయలసీమ ప్రాంతానికి సైతం ఈ బస్టాండ్ మీదుగానే బస్సులు రాకపోకలు సాగించేవి. 1983లో జాతీయ రహదారిపై జడ్చర్ల బస్టాండ్‌ను ప్రారంభించడంతో బాదేపల్లి బస్టాండ్ నిరాధరణకు గురవుతూ వచ్చింది. కాలక్రమేణ గ్రామీణ ప్రాంతాలకు బస్సుల రాకపోకలు తగ్గడం.. ప్రైవేటు వాహనాల హవా కొనసాగడంతో బస్టాండ్ ద్వారా వెళ్లే ప్రయాణికుల సంఖ్య తగ్గిపోయింది. దీనికి తోడు రైల్వేగేట్ సమస్య కారణంగా వనపర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులు బాదేపల్లి బస్టాండ్‌కు రాకుండా నేరుగా సిగ్నల్‌గడ్డ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి.

కలగా మారిన మినీ ఆర్టీసీ డిపో..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు ముఖ్య కేంద్రంగా జడ్చర్ల ఉంది. ఈక్రమంలో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని దశాబ్దాలుగా డిమాండ్ ఉంది. అయితే 1995లో అప్పటి ఎమ్మెల్యే ఎర్రసత్యం మినీ డిపోను మంజూరు చేయించారు. అదే ఏడాది ఆగస్టులో ఆయన హత్యకు గురికావడంతో ఆర్టీసీ డిపో మంజూరు పేపర్లకే పరిమితమైంది. ఆ తర్వాత 1996 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన ఎర్రశేఖర్ కొంత ప్రయత్నించినప్పటికీ.. మంజూరైన డిపో కాస్త మహబూబ్‌నగర్–2 డిపోగా మారిపోయింది. అప్పటి నుంచి డిపో ఏర్పాటు కలగానే మారింది.

మహిళలకు ఉచిత ప్రయాణంతో డిమాండ్..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీంతో బాదేపల్లి బస్టాండ్‌కు ఆర్డినరీ బస్సులతో పాటు ఎక్స్‌ప్రెస్‌లు రావాలన్న డిమాండ్ పెరుగుతోంది. ఫార్మా ఇతర పరిశ్రమల కారణంగా ఎంతో అభివృద్ధి సాధించిన బాదేపల్లి, జడ్చర్ల నుంచి హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సుల కొరత తీవ్రంగా ఉంది. హైదరాబాద్ వెళ్లాలన్నా ఇతర డిపోల బస్సులపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో బస్ డిపో ఉంటేనే బాగుంటుందున్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఎన్నికల ప్రచారంలో భాగంగా బాదేపల్లి బస్టాండ్ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈమేరకు హామీని నెరవేర్చుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.

ప్రజాకాంక్ష నెరవేర్చాలి..



ప్రధాన రూట్ల నుంచి బాదేపల్లి బస్టాండ్ మీదుగా బస్సుల రాకపోకలను పునరుద్ధరించి, పూర్వవైభవం తీసుకురావాలి. బస్టాండ్ అభివృద్ధిపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపడం సంతోషంగా ఉంది. స్థానిక ప్రజల ఆకాంక్ష మేరకు బస్ డిపో ఏర్పాటుచేసి, బస్సుల కొరతను తీర్చాలి.

– రమేష్, కౌన్సిలర్, పాతబజార్

డిపో కావాల్సిందే..



జడ్చర్ల వివిధ రాష్ట్రాలకు కేంద్రంగా ఉంది. ఇక్కడ బస్ డిపో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ప్రయాణికుల రద్దీ విపరీతంగా ఉంది. ఇక్కడి నుంచి నేరుగా హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు బస్సులను ఏర్పాటు చేయడం సౌకర్యవంతంగా ఉంటుంది.

– సలాం, కావేరమ్మపేట

రవాణా శాఖ మంత్రికి విన్నవించిన ఎమ్మెల్యే..

బాదేపల్లి బస్టాండ్‌కు పూర్వవైభవం తీసుకురావడం.. స్థానికుల ఆకాంక్ష మేరకు బస్ డిపో ఏర్పాటుకు చర్యలు మొదలయ్యాయి. ఈమేరకు స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఇటీవల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి విన్నవించారు. బాదేపల్లి బస్టాండ్ మీదుగా బస్సుల రాకపోకలు సాగించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు జడ్చర్లకు బస్ డిపో మంజూరు చేయాలని.. తద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.



రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి (ఫైల్) ➤

అంగన్‌వాడీల రిటైర్మెంట్ నిర్ణయం సరికాదు



రిలే నిరాహార దీక్ష చేపట్టిన అంగన్‌వాడీ టీచర్లు

మహబూబ్‌నగర్ రూరల్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు 65 ఏళ్లు నిండితే తప్పనిసరిగా పదవీ విరమణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనడం సరికాదని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ, శుక్రవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం జారీ చేసిన జీఓతో 65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను విధుల నుంచి తొలగించడం తగదన్నారు. పదవీ విరమణ పొందే అంగన్‌వాడీల టీచర్లకు రూ. 2లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇవ్వడంతో పాటు న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని అన్నారు. కార్యక్రమంలో సత్యమ్మ, బాలమణి, పుష్పమ్మ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి



ఆస్పత్రిలో సమస్యలను తెలుసుకుంటున్న వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా నాయకులు

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ తరహా వైద్యం అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రిని ఐద్వా నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. అదేవిధంగా సాంఘిక సంక్షేమ, బాలికల కళాశాల హాస్టళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జడ్చర్ల ఏరియా ఆస్పత్రిలో అత్యవసర వైద్యానికి సంబంధించిన డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వెంటనే భర్తీ చేయాలన్నారు. సీజన్ వ్యాధులు ప్రబలే కాలం కావడంతో రోగులు అత్యధికంగా ఆస్పత్రికి వస్తున్నారని, వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఇక బాలికల హాస్టల్, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నోట్‌బుక్స్ అందించాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా మండల నాయకురాలు వసియాబేగం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నర్సింహ, సంధ్యారాణి, యాదమ్మ, లలిత, పోశన్న తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు



10 వార్డులో నిల్వ నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్

భూత్పూర్: మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా పట్టణంలోని 4, 10 వార్డుల్లో పర్యటించి, నిల్వ నీటిని పారబోయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఇళ్లలో ఎక్కువ రోజులపాటు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి, నాయకులు నారాయణగౌడ్, సురేష్‌గౌడ్, కృష్ణయ్యగౌడ్, తిరుపతయ్యగౌడ్ పాల్గొన్నారు.

భావితరాల కోసం మొక్కలు పెంచండి



బస్వాయపల్లిలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్



శంకరాయపల్లి క్రాస్‌రోడ్డు వద్ద మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు

దేవరకద్ర: భావితరాల కోసం మొక్కలు నాటి పెంచాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ కోరారు. వన మహోత్సవంలో భాగంగా దేవరకద్ర మండలం బస్వాయపల్లిలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పచ్చదనం పెరిగితే వర్షాలు కూడా సమృద్ధిగా కురుస్తాయన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో పలు రికార్డులను పరిశీలించడంతో పాటు రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో శుభ్రత పాటించాలని వైద్యాధికారి శరత్‌కు సూచించారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీనివాసరావు ఉన్నారు.

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని 9వ వార్డు శంకరాయపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో శుక్రవారం వన మహోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజయ్య ఆధ్వర్యంలో కౌన్సిలర్లు చైతన్య చౌహాన్, నందకిశోర్, కుమ్మరి రాజు, సతీష్, ఎస్.రమేష్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది మొక్కలు నాటారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



వెన్నాచేడ్‌లో ఎస్సీ వసతిగృహాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి పాండు

గండేడ్: సీజనల్ వ్యాధుల నివారణ కోసం ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి పాండు, ఎంపీడీఓ దేవన్న అన్నారు. శుక్రవారం మండలంలోని వెన్నాచేడ్‌లో పర్యటించారు. ముందుగా ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. వన మహోత్సవంలో భాగంగా వసతిగృహం ఆవరణలో వార్డెన్ మోహన్‌రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. మోడల్ స్కూల్‌లో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. కిచెన్‌షెడ్, డ్రెయినేజీ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలో చేపట్టిన డ్రైడేను పరిశీలించారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే పాటించాలని గ్రామస్తులకు సూచించారు. వర్షాలు కురుస్తున్నందున శిథిలావస్థకు చేరిన మట్టి ఇళ్లలో నివాసం ఉండరాదని తెలిపారు. వారి వెంట మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి కలీం, కారోబార్ పుల్లారెడ్డి ఉన్నారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టండి

జడ్చర్ల టౌన్: గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కోరుతూ బీసీసేన ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ విష్ణువర్ధన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా ఖాళీ స్థలాల్లో వర్షపు, మురుగు నీరు నిలిచి, దోమలు విజృంభిస్తున్నాయని తెలిపారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీసేన అధ్యక్షుడు నిరంజన్, నర్సింహులు, రామస్వామి, రాము, భీంరాజ్, భాస్కర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు



గండేడ్: మండలంలోని వెన్నాచేడ్‌లో శుక్రవారం పోచమ్మ బోనాల పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఇంటికో బోనంతో మహిళలు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని ప్రదక్షిణలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. తమ కుటుంబం, గ్రామం సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు



మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి, వస్పుల, రాణిపేట హెల్త్ సబ్‌సెంటర్ల పరిధిలో శుక్రవారం క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. క్షయ నివారణ కార్యక్రమంలో భాగంగా దాదాపు 200 మందికి పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ శివకాంత్ తెలిపారు. వైద్యబృందం డా.అనూష, కిరణ్, నందిని, దేవయ్య, తిమ్ములు, జ్యోతి, జంగయ్య, సంపత్, అంజులమ్మ, సరస్వతి పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మహమ్మదాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో 62 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఇప్పటికే మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500లకే సిలిండర్ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయడంతో పాటు నిరుద్యోగులు, రైతులను ఎంతో మోసం చేసిందన్నారు. అలాంటి నష్టాలను పూడ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కష్టపడుతున్నారని తెలిపారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అన్నారు. అనంతరం తహసీల్దార్, కార్యాలయ ఆవరణతో పాటు జూపల్లిలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుపతయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, డీసీసీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రాంలాల్, కమతం రాజేందర్‌రెడ్డి, శాంతిబాయి, రాధారెడ్డి, లక్ష్మీమోహన్, చెన్నయ్య, రహీం, అప్సర్, వెంకట్రాములు, నారాయణ, ముకుందం పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన ఎన్.ప్రీతంను జిల్లా దళిత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.సాయిబాబా మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా చైర్మన్‌ను పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన దళిత్ కాంగ్రెస్ విభాగం నాయకులు పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్యంపై అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో శుక్రవారం మహిళా ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా హాస్టల్ చీఫ్ వార్డెన్ సంధ్యారాణి మాట్లాడుతూ.. బాలికలు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలని సూచించారు. శరీరంలో జరిగే మార్పులను గమనించి, హార్మోన్ల సమతుల్యం, జీవక్రియ తదితర అంశాల్లో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, అనురాధారెడ్డి, మలావి, పుష్పలత, మాధురి, కల్పన, స్వాతి పాల్గొన్నారు.

భారీ వర్షం

రాజాపూర్(బాలానగర్): మండలంలో శుక్రవారం ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. బాలానగర్‌లో కూరగాయల సంత జలమయమైంది. దీంతో క్రయ, విక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షంతో పత్తి, మొక్కజొన్న, జొన్న పంటలకు మేలు చేకూరుతుందని రైతులు సంతోషం వ్యక్తంచేశారు.

కొత్త మండలంలో వనరులు కల్పించండి

దేవరకద్ర: కొత్తగా ఏర్పడిన కౌకుంట్ల మండలంలో ప్రజలకు అవసరమైన వనరులు కల్పించాలని కోరుతూ శుక్రవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వనపర్తిలో జరిగిన ఉమ్మడి జిల్లా రైతుల అభిప్రాయ సేకరణ సభకు వచ్చిన మంత్రిని ఆయన కలిసి పలు సమస్యలను వివరించారు.

రోడ్డు ప్రమాదాలపై విచారణ

జడ్చర్ల: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్స్‌ను శుక్రవారం ట్రాఫిక్ సేఫ్టీ డీఎస్పీ సుదర్శన్ పరిశీలించారు. బూరెడ్డిపల్లి క్రాస్‌రోడ్ వద్ద తరచూగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోవడంపై విచారించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. డీఎస్పీ వెంట స్థానిక సీఐ ఆదిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



బాదేపల్లిలో సన్మానం పొందిన ఉపాధ్యాయులు



అప్పంపల్లి ఉన్నత పాఠశాలలో..

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని బాదేపల్లి బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన, కొత్తగా బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా ఇటీవల పదవీ విరమణ పొందిన అటెండర్ చిన్నమ్మను సత్కరించారు. సన్మానం పొందిన వారిలో ఉపాధ్యాయులు అమృత, ఉమాదేవి, రజిని, ప్రమీలాబాయి, శ్రీలత, సంధ్యారాణి, రవీందర్‌సింగ్, రాంచంద్రయ్య, యూనిస్‌బ్లెస్సి, కె.కృష్ణ, శ్రీదేవి ఉన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు వరలక్ష్మి, బాలీశ్వరి, కవిత, అమరావతి, ప్రవర్ధిని, స్నేహలత, నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

➩ పదోన్నతి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శనివారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రేమ్‌రంగా గార్డెన్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఈఓ మంజులాదేవి తెలిపారు.

చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు చక్రవర్తిగౌడ్, పద్మజ, రవిశంకర్, శ్రీనివాసులు, సుశీల, సాదియా పర్వాత్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం రేవతి, రాజలక్ష్మమ్మ, గోవర్ధన్ యాదవ్, శ్రీగురు భూపాల్ రెడ్డి, మణివర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, యుగేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌గౌడ్, రాజు, రంగారెడ్డి పాల్గొన్నారు.

హన్వాడ: మండలంలోని మునిమోక్షం యూపీఎస్ నుంచి బదిలీ అయిన హెచ్‌ఎం కిష్యా నాయక్, ఉపాధ్యాయులు రమాదేవి, స్వప్నలను గ్రామస్తులు శాలువాతో సత్కరించి, వీడ్కోలు పలికారు. ఎంఈఓ రాజునాయక్, మాజీ ఎంపీపీ బాల్‌రాజు, ఎల్లమ్మ, సంపత్‌కుమార్, జ్యోతి పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ పాఠశాలకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

చిన్నచింతకుంట: మండలంలోని దమగ్నాపూర్‌లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ మోహన్‌రావు పరిశీలించారు. గ్రామంలోని 263 సర్వే నంబర్‌లో ఉన్న 20 ఎకరాల ప్రభుత్వ భూమి వివరాలను తహసీల్దార్ సి.కృష్ణయ్యను అడిగి తెలుసుకున్నారు. స్థల పరిశీలన నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట ఆర్ఐ శశికుమార్ ఉన్నారు.